కథ

# క్రైడిల్ టి.వి!

– ఉపద్రష్ట సాయి

రోడ్డు సైడు పేవ్‌మెంటు మీది పుస్తకాల షాపులో పుస్తకాలు కెలుకుతున్నారు ఆ ఇద్దరు పిల్లలు. వాళ్ళ వయసు పది, పదకొండు సంవత్సరాలు. అప్పటికే పదిహేను నిమిషాల నుండి పుస్తకాలు వెతుకుతున్నారు వాళ్ళు. కొట్టు యజమాని వాళ్ళకేసి చూస్తూ "ఒరేయ్! ఇందాకటి నుంచి పుస్తకాలు కెలుకుతున్నారు. అసలు మీకు కావలసిన పుస్తకాలు ఏమిటి?" అని అడిగాడు.

"మాకు... మాకు.. సినిమా పాటల పుస్తకాలు కావాలి.." అన్నారు ఇద్దరూ.

"సినిమాపాటలా.. అయ్యోందుకురా మీకు.. ఎంచక్కా బళ్ళో సదూకునే పుత్తకాల గురించడక్కుండా బయాస్కోపు పుస్తకాలేటికిరా" అడిగాడు యాదయ్య అనే కొట్టు యజమాని.

"బళ్ళో చదూకునే సరకు మా దగ్గ రుందయ్యా.. బయాస్కోపు పుస్తకాలే లేవు. నాగార్జున, వెంకటేష్, ఆలీ, బాలకృష్ణ, చిరంజీవి.. నటించిన సినిమా పాటల పుస్తకాలు కావాల.." మళ్ళీ అడిగారు ఆ కుర్రాళ్ళు.

"సూడండ్రా.. ఆ ఎదురంగ వున్న కిళ్ళీ కొట్లో సిన్మాపాటల పుస్తకాలుంటాయి.. ఎల్లి కనుక్కోండి" అని వాళ్ళని ఆ షాపుకేసి తోలాడు యాదయ్య. ఆ ఇద్దరూ రోడ్డు క్రాసు చేయబోతుండగా యాదయ్య వాళ్ళను కేకేసి "మీకెందుకురా ఆ పాటల పుస్తకాలు.. సదువుకునే పుస్తకాలు సదువు కోవచ్చు గందా" అన్నాడు.. మనసులోని మాటను దాచుకోలేక. "నువు టి.వి. చూడవా" అడిగాడు ఒక కుర్రాడు.



"నా మొఖానికి టి.వి. ఒకటా" యాదయ్య చెప్పాడు.

"అందుకే నీకు తెలీదు.. టి.విలో వారం వారం సినిమా క్విజ్ వుంటుంది.- అలాగే పాటల పోటీలు వుంటాయి.. అలాగే అంత్యాక్షరి కార్యక్రమం వుంటుం ది. వాటిల్లో పాల్గొని గెలిస్తే వాళ్ళు బహు మతులిస్తారు. ఉత్తుత్తి బహుమతులు కావు.. టేపు రికార్డు, ప్రెషర్‌కుక్కర్, ఫ్రిజ్.. గ్యాస్‌పొయ్యి వంటి ఖరీదైన బహుమతులు. అందుకే పాటల పోటీలో పాల్గొనడానికి ఈ పాటల పుస్తకాలు కొని చదువుకుంటే వాళ్ళడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పవచ్చు.. అర్థమైందా" అన్నాడు ఓ కుర్రాడు... సవివరంగా తానెందుకు పాటల పుస్తకాలు వెదుక్కుంటున్నాడో వివరిస్తూ. "అది సరే బాబూ.. మరి మీ బడి పాఠాలు" అడిగాడు యాదయ్య.

"చదువుతాం.. ఎప్పుడైనా. అవి చదివితే బహుమతులు రావు. మార్కులు వస్తాయి. పరీక్షలప్పుడు చదుకుంటే చాలు.. మా అమ్మ చదివితే తిడుతుంది కూడా" అన్నాడు ఒక కుర్రాడు. "ఎందుకని" ఆశ్చర్యంగా అడిగాడు యాదయ్య.

"వారం వారం టి.విలో కొందరు పిల్లలు టివిలు, ఫ్రిజ్‌లు బహుమతులు పొందుతుంటే 'మీరూ ఉన్నారెందుకు దద్దమ్మలు' అని తిడుతుంది.. " అన్నాడు మరొక కుర్రాడు.

"సరే.. చూడండ్రా! ఈ టి.వి పోటీలు మిమ్మల్ని సెడగొడుతున్నా ఎదవల్లారా.. సదువుకునే పిల్లలకు క్విజ్‌లు పెట్టే సోర్థపరులు బాగుపడతారా.. డబ్బులెట్టాగైనా సెంపాదించచ్చు.. కానీ బడిపిల్లలను సెడగొట్టి సంపాదించే పద్ధతి నీచమైనది..

"అట్టా మిమ్మల్ని సెడగొడుతూ కొందరు డబ్బు గడిస్తున్నారు. అయన్నీ మీకొద్దు. బుద్ధిగా సదువుకోండి. మంచి మార్కులు సంపాయించండి. ఉజ్జోగాలు సెయ్యండి. లేదా యాపారం సెయ్యండి. కట్టపడి సంపాయించండి. ఈ అడ్డుదోవలు వద్దు.. సిన్నప్పుడు నేనెదవలవాట్లకు పోయి ఈనాడు ప్లాట్‌ఫారమ్ మీద పుత్తకాలమ్ముకుంటన్నా... పొండి.. పోయి సదువుకోండి. పాఠాలు" అని తన గుండె లోని బాధను వెళ్ళగక్కుతూ వాళ్ళకు చిన్న సలహా ఇచ్చాడు యాదయ్య.

ఆ ఇద్దరూ ఒకళ్ళ మొహ లొకరు చూసుకుంటూ వెళ్ళి పోయారు. వారిద్దరూ రామం.. రాఘవ గార్ల పుత్రరత్నాలు! ఆ రాత్రి రామం సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చేస్తూ ఏవేవో పుస్తకాలు తిరగేస్తున్నాడు.

"ఏమిటండీ.. ఐఎఎస్ పరీక్షకు చదివేలా పుస్తకాలు తెగ తిరగేస్తున్నారు" అంటూ వచ్చింది విచిత్ర, రామం భార్య.

ఒక అద్భుతమైన ఐడియా తనలో దాచుకుని భర్త దగ్గరికి వచ్చింది విచిత్ర.

"ఆ ఏం లేదు.. డిపార్ట్ మెంటల్ పరీక్షలు దగ్గర పడు తున్నాయిగా.. అందుకే కాస్త సీరియస్‌గా చదువుతున్నాను. వచ్చే ఏడాదైనా ప్రమోషన్ సంపాదించేయాలిగా" అన్నా డు రామం.

"ఓహ్! అంతేనా.. ఇంకా ఏదో పనికొచ్చే పని చేస్తున్నా రనుకున్నాను" అన్నది విచిత్ర వెటకారంగా.

"పనికొచ్చే పనా.. అంటే నేను చదువుకోవడం పనికిరాని పనా" అడిగాడు కోపంగా రామం.

"ఈ డిపార్ట్‌మెంటల్ పరీక్ష పాసైతే.. మీకొచ్చే బోడి ప్రమో షన్ విలువ నెలకు వంద రూపాయల ఇంక్రిమెంట్ .. అంటే మీ జీవిత కాలంలో.. మీ సర్వీసున్నంతవరకు మీకు వచ్చే ఆదాయం మహా అయితే లక్షరూపాయలు.. అందుకోసం ఈ కష్టం.. కానీ మీకో మంచి ఐడియా చెప్తాను.. వినండి.. అంతకు నాలుగు రెట్ల ఆదాయం.. ఆరునెలల్లో గడించవచ్చు.. ఆ డబ్బును ఇన్వెస్ట్ చేస్తే మీ సర్వీసు పూర్తయ్యేలోగా పదిరెట్లు సంపాదించవచ్చు..' అంటున్న విచిత్రకేసి ఆశ్చర్యంగా చూసాడు..

"ఏమిటా ఐడియా..." అడిగాడు రామం..


"అలా రండి దారికి.. చూడండి.. సేటిలైట్ టి.వి పుణ్యమా అని చిన్న పెద్దా, వృద్ధుల తేడా లేకుండా, ఆడ మగా వర్గ భేదాలు లేకుండా రకరకాల క్విజ్‌లు, లెక్కలేనన్ని బహుమతులు మన అందరికీ అందుబాటులో వున్నాయి. పోనీ ఆ క్విజ్‌లు పనికి వచ్చేవా అంటే నయాపైసాకు కూడా పనికిరానివే అని చెప్పవచ్చు. అయినా ఆ పనికిరాని చెత్త, నికృష్టపు క్విజ్‌లో పాల్గొనే వారికి చప్పట్లు, జోహార్లు వీటితో పాటు ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, టూ ఇన్‌వన్‌లు బహుమతులుగా ముట్టుతున్నాయి. వాళ్ళు టి.విలో ఘనకార్యం సాధించిన వాళ్ళలా చెలామణీ

అవుతున్నారు. 'జ్యోతిలక్ష్మి ఫలానా సిన్మాలో ఎన్నిసార్లు కన్నుకొట్టింది'' ఈ ప్రశ్నకు సమాధానం సరిగ్గా రాసినవారికి ఒక ప్రముఖ కంపెనీ కలర్ టి.వి బహుమతిగా ఇస్తుంది.

"నాగార్జున ఫలానా చిత్రంలో ఫలానా ఊతపదం ఎన్నిసార్లు అన్నాడో చెప్తే వాళ్ళకి మారుతీ కారు బహుమతిగా ఇస్తారు. ఇలాంటి రసవత్తరమైన క్విజ్ కార్యక్రమాల వల్ల మన జనరల్ నాలెడ్జి హిమాలయా శిఖరాలంత ఎత్తుకు ఎదిగి పోతుంటే.. ఇంకా డిపార్ట్‌మెంటల్ చెత్త ఎందుకండీ'' అంటున్న విచిత్రతో

"అసలింతకీ .. నన్నేం చెయ్యమంటావో చెప్పు'' అడిగాడు రామం..

"తెలుగు సినిమా చరిత్ర..'' అనే పేరుతో గత యాభై సంవత్సరాలలో వచ్చిన తెలుగు చిత్రాల పేర్లు, వాటి తాలూకు నటీ నటులు, సాంకేతిక నిపు ణులు, అవి రిలీజైన తేదీలు, ఎన్ని థియేటర్లలో రిలీజైనవి, ఎన్ని రోజులు ప్రదర్శింపబడినాయి, ఆ సినిమాల్లో వచ్చిన మంచి మాటలు, బూతు లేదా ద్వంద్వార్థపు మాట లు, వాటి లిస్టు వగైరా వివరాలతో ఒక చిన్న ఎన్ సైక్లో పీడియా తయారు చెయ్యండి. ఏడాది టైం తీసుకున్నా ఫరవాలేదు. ఆ పుస్తకం 'పార్ట్ వన్'గా రిలీజు చెయ్యండి.. తర్వాత్తర్వాత రిలీజవుతున్న చిత్రాల వివరాలతో పార్ట్ టూ, త్రీ, ఫోర్ అంటూ ఏటా ఒక వాల్యూమ్ రిలీజ్ చెయ్యండి. బడి, కాలేజీ పుస్తకాల కన్నా, భగవద్గీత, రామాయణం పుస్తకాల కన్నా మన సిన్మా పుస్తకం వేడి అట్లలా ఎగిరి పోతా యి.. '' అని తన ఐడియా నవివరంగా చెప్పింది విచిత్ర.



అర్జెంటుగా మరో సిగ రెట్ కాల్చేసి ఆలోచించి డిపార్ట్‌మెంటల్ పుస్తకాల ను మూసి ప్రక్కకు బెట్టాడు రామం.

మర్నాడు బళ్ళోనుంచి రామానికి ఉత్తరం వచ్చిం ది.

"ఏమండీ.. మీకు మన అబ్బాయి చదువు తున్న బడిలో నుంచి ఉత్తరం వచ్చింది..'' అం టూ ఉత్తరం అందించిం ది విచిత్ర.

ఏమిటో అనుకుని అర్జెంటుగా ఉత్తరం చించి చూశాడు రామం.. సోమవారం .. సాయంత్రం నాలుగు గంటలకు బడికి ఒకసారి రమ్మని ఉన్నది ఆ ఉత్తరంలో. పుత్రరత్నం .. మార్కుల గురించి తిట్టడానికి పిలుస్తున్నారేమో అనుకుని బెరుకు బెరుకుగా బడికి వెళ్ళాడు రామం. "రండి.. రండి మిస్టర్ రామం..'' అంటూ చిరునవ్వు నవ్వుతూ స్వాగతం పలకింది విఘ్నేష్ క్లాస్ టీచర్.

"మీ ఉత్తరం..'' అంటూ నసిగాడు రామం! "అదేనండీ.. మన స్కూలుడే రోజు.. పిల్లల చేత మంచి సినిమా పాటల డాన్సులు చేయించాలను కుంటున్నాం. ఎందుకంటే సేటిలైట్ టి.వి. వాళ్ళు ఈ కార్యక్రమాన్ని షూట్ చేసి కేబిల్ టి.విలో చూపిస్తారట. అందుకోసం మన స్కూలు అధికారులతో ఒప్పందం చేసుకున్నారు. కనుక ఈ ఏడు హాఫ్ ఇయర్లీ పరీక్షలు క్రిస్టమస్ సెలవల తర్వాత పెడతాము. అంతే కాదు. విఘ్నేష్‌కు ఒక జీన్స్ పాంటు, టీ- షర్టు కొనండి. అవి అతని దుస్తులు.. ఆ ప్రోగ్రాంలో వాడుకోవడానికన్న మాట.. ఆ వాడి పాట. 'హలో బ్రదర్'లో శుభరాగాలే.. అనేపాట...'' అంది ఆ స్కూలు టీచరు. "దీనికోసం ఉత్తరం రాశారా'' అడిగాడు రామం.

"అవునండీ.. రేపటి నుంచి మీ అబ్బాయి మరో గంట ఆలస్యంగా ఇంటికి వస్తాడు. ఎందు కంటే ఆ పాటకు డాన్స్ చెయ్యడం నేర్పిస్తున్నాం. ఒక డాన్స్‌మాస్టర్ గారు వస్తారు కూడా'' అన్నది టీచరు.

"అలాగేనండి.. వస్తాను..'' అంటూ బయటికి నడిచాడు రామం... ఛ.. ఛ ఇందుకా నన్ను పిలిచారు.. అనుకున్నాడు మనసులో.

మెల్లగా ఇంటికి చేరుకున్న రామంతో విచిత్ర .. "మీకో విషయం తెలుసా.. మన ఎదు రింట్లో వున్న రాఘవ గారి చిన్నబ్బాయికి 'వ్యాక్యూమ్ క్లీనర్' బహుమతి వచ్చింది.. అంత్యాక్షరి పోటీల్లో.... వెధవ.. పదేళ్ళు నిండకుండానే పాటల పోటీల్లో బహుమతి కొట్టేశాడు'' అంటోంది.

"నీకో విషయం .. తెలుసా'' అడిగాడు రామం.

"ఏమిటో..'' అడిగింది విచిత్ర.

"రాఘవ పెద్ద కొడు కు ఎమ్ బి ఎ పాసయ్యాడే వాడికి అమెరి కాలో ఉద్యోగం వచ్చింది. ఆ విషయం కన్నా వాక్యూమ్ క్లీనర్ బహుమతిగా సంపాదించుకున్న విష యం.. ఇంపార్టెంట్‌గా తోచిందా నీకు.'' అన్నా డు విసుగ్గా.

తర్వాత మళ్ళీ తనే అన్నాడు.

"ఈ దేశం.. సర్వనాశ నమైపోతూందంటే ఆశ్చ ర్యం లేదు. ప్రతివాడు తన స్వార్థం కోసం.. చిన్నా పెద్దా ఆడా మగా తేడాలు చూడకుండా ఎదుటి వారిని, వారి బలహీన తలను వాడుకుంటు న్నారు. వ్యాపారానికి కూడా కొన్ని కొలబద్దలు వుండాలి.. కానీ అవి నేడు లేవు. బాలకార్మికులను ప్రోత్సహించడం ఎలా నేరమో.. బడికి వెళ్ళి చదువుకునే పిల్లలను పెడద్రోవన బెట్టే టి.వి కార్యక్రమాలను ప్రసారం చెయ్యడం కూడా నేరమే. కానీ.. సేటిలైట్ పేరిట వ్యాపారవేత్తలు, ఆ ప్రోగ్రామ్స్‌లో తమ వ్యాపార ప్రకటనలను విస్తృతంగా ఇస్తూ మరి కొందరు వ్యాపారస్తులు, వాటితో బాటు బహుమతులు పంచిపెడుతూ ఇంకా కొందరు వ్యాపారస్తులు, ఆ పోటీలకు తగ్గ వస్తు విక్రయకారులు.. ఇలా ప్రతిఒక్కరు ఎదుటివారిని వాడుకుంటున్న ఈ వ్యవస్థ బాగుపడితే గానీ.. సమాజం బాగుపడదు.. చివరకు బడిలో, గుడిలో కూడా టి.వి. కార్యక్రమాలు. దూరదంతో సర్వం బుల్లితెర మయమైపోతున్నది.

"సిగరెట్టునీ, మద్యపానాన్ని ఎన్ని చట్టాలు పెట్టినా అరికట్టడం సాధ్యం కానట్లే.. వ్యాపార ధోరణిలో సాగే సాటిలైట్ టి.వి. కార్యక్రమాలను కూడా అరికట్టడం అసాధ్యం. కనుక మనం మనకి పనికివచ్చేవాటిని ఏరుకోవడంలో మరింత శ్రద్ధ వహించాలి. లేకపోతే.. మన బలహీనత వల్ల మరొకడు ధన సంపాదన చేసుకొని మనల్ని పేవ్‌మెంట్ల మీదికి తెచ్చేస్తాడు..'' అన్నాడు రామం. అంతా ఓపిగ్గా విన్న విచిత్ర "ఇంతకీ మన తెలుగు సినిమా చరిత్ర..'' అడిగింది.

"పురిటిబిడ్డ నరాల్లో ప్రవహించే దశకు చేరుకుంది- సేటిలైట్ పుణ్యమా అని ఈనాడు,'' అని పూర్తి చేశాడు రామం. ❑